సాక్షి మహబూబ్‌నగర్

గురువారం ၊ 8 ၊ జూన్ ၊ 2023



ఇదేం చోద్యం?

నెల రోజుల క్రితం పూర్తయిన పనులకు మళ్లీ టెండర్లు నిర్వహించారు.

వివరాలు 8లో ▸



నిలకడగా ఉల్లి ధరలు

దేవరకద్ర మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి ధరలు నిలకడగా కొనసాగాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.7 /24.3

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు చెందిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత మత్స్య సంపదను పెంచేందుకు కృషి చేసినట్లు తెలిపారు. లక్షలాది చేపపిల్లలను చెరువుల్లో విడిచిపెట్టినట్లు తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి 3 రోజుల పాటు శిల్పారామంలో ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లైవ్ ఫిష్ స్టాల్, ఫుడ్‌స్టాల్స్‌తో అద్భుతంగా ఉత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ రాధారోహిణి, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్, మున్సిపల్ డీఈ బెంజమిన్, సైనిక సంక్షేమాధికారి వనజ, హన్వాడ తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జేపీఎన్‌సీలో టాస్క్ శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జేపీఎన్‌సీ కళాశాలలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్‌లకు సంబంధించిన అంశాలపై టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ మేరకు ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాలపై తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో టాస్క్ శిక్షకులు వెంకటేశ్, గురువేందర్‌రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

10న జీవన రేఖలు పుస్తక ఆవిష్కరణ

పాలమూరు: పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10న వనపర్తి జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవన్‌లో అమరుడు జంగిడి బుచ్చన్న సంస్మరణ సభతో పాటు 'జీవన రేఖలు' అనే పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ జి.హరగోపాల్ హాజరవుతారని పేర్కొన్నారు.

పటిష్టంగా అమలు చేయాలి: డీఈఓ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు బోధనాభ్యాసన ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆర్వీఎం మీటింగ్‌హాల్‌లో పలు ఉపాధ్యాయ సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాలంటే ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు సహకరించి ప్రధానపాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాల నాయకుల నుంచి సూచనలు తీసుకున్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలు యాదవ్, శ్రీనివాస్, డీఎస్‌ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు విస్తృత కార్యక్రమాలు

పాలమూరు: తెలంగాణ ప్రభుత్వం జూన్ నెలను మలేరియా మాసోత్సవంగా ప్రకటించిందని, ఈ నెల రోజులు దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా, డెంగీ వ్యాధులు అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం మెడికల్ ఆఫీసర్లకు, సూపర్ వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. దోమలు మూతలు లేని నీటి నిల్వలలో మాత్రమే గుడ్లు పెడతాయి, వాటి ద్వారా దోమలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడు వాపు, బోదకాల వంటి వ్యాధులు వస్తుంటాయని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండే ప్రదేశాలను ముఖ్యంగా కూలర్స్, డ్రమ్ములు, నీటి తొట్లు, డబ్బాలు, పాత టైర్లు కనీసం వారానికి ఒక్కసారైనా ఖాళీ చేయాలన్నారు. ప్రధానంగా దోమ తెరలు వాడాలని, ఇంట్లోని అన్ని నీటి నిల్వలపై మూతలు పెట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడంతో పాటు దోమలు పెరిగే నీటి గుంతలలో గంబూషియ చేపలను వదిలిపెట్టాలన్నారు. జ్వరం ఉన్న వారికి రక్త పరీక్షలు తప్పక చేయించుకోవాలని సూచించారు. ఈ నెల రోజుల కార్యక్రమంలో పంచాయతీరాజ్, మున్సిపాలిటీలు, నీటి పారుదల శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, మలేరియా అధికారిని డాక్టర్ శ్వేతారెడ్డి, పీఓఎన్‌సీడీ డాక్టర్ కిరణ్మయి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రఫీక్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిని డాక్టర్ జరీనా, మాస్ మీడియా అధికారి తిరుపతి రావు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



ఆంతర్యమేమిటో..?

- జిల్లాలోని రెండు నియోజకవర్గాల ఆడిట్ బాధ్యత ఒకే ఏజెన్సీకి..
- మండలానికి ఒక సంస్థతో ఆడిట్ చేయించాలనే నిబంధనకు పాతర
- సెర్ప్ ఆదేశాలను బేఖాతర్ చేసిన ఐబీ సెక్షన్ అధికారి
- నాలుగు మండలాలు మినహా పూర్తయిన ఆడిట్



కోయిలకొండ మండలంలో ఆడిట్ నిర్వహిస్తున్న వీవీసీ ఏజెన్సీ ప్రతినిధి (లైట్ గ్రీన్ షర్ట్ ధరించిన వ్యక్తి)



చిన్నచింతకుంట మండలంలో ఆడిట్ నిర్వహిస్తున్న వీవీసీ ఏజెన్సీ ప్రతినిధి (లైట్ గ్రీన్ షర్ట్ ధరించిన వ్యక్తి)

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని స్వయం సహాయ సంఘాల లావాదేవీల నిర్వహణపై ఆడిట్ చేపట్టారు. ఇందుకోసం సెర్ప్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఓ ప్రతి మండలానికి ఒక ఆడిటర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 15 మండల మహిళా సమాఖ్యలతో పాటు గ్రామైక్య సంఘాల ఆడిట్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ప్రతి మండలానికి ఒక ఆడిట్ ఏజెన్సీకి అవకాశం ఇవ్వాలన్న నిబంధనను ఐబీ సెక్షన్ అధికారి బేఖాతర్ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సెర్ప్ నిబంధనలకు విరుద్ధంగా రెండు నియోజకవర్గాలకు చెందిన ఆడిట్ చేసే ప్రక్రియను కేవలం ఒక్క వీవీసీ అసోసియేషన్ ఏజెన్సీకి అప్పజెప్పడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇందులో అక్రమాలు జరిగాయో.. మరేదైన కారణమో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహబూబ్‌నగర్ రూరల్ మండలం, కోయిల్‌కొండ, గండేడ్, చిన్నచింతకుంట, దేవరకద్ర, హన్వాడ మండలాలతో పాటు దేవరకద్ర నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు జడ్చర్ల నియోజకవర్గంలోని కొన్ని మండలాలను సదరు ఏజెన్సీకే అప్పగించినట్లు సమాచారం.

16 ఏజెన్సీలు ఎంపిక..

జిల్లాలోని మహిళా సంఘాల లావాదేవీలను ఆడిట్ చేసేందుకు 16 ఏజెన్సీలను ఎంపిక చేశారు. ఆడిట్ కోసం మొత్తం 48 ఏజెన్సీలు ముందుకు రాగా.. 16 ఏజెన్సీలను మాత్రమే ఎంపిక చేశారు. ఇందులో అడ్డాకుల మండల బాధ్యతను సీవీరెడ్డి కంపెనీ, బాలానగర్ ఎం.శ్రీధర్‌రెడ్డి, భూత్పూర్ మండలం దేవా, అసోసియేట్స్, చిన్నచింతకుంట వీఎస్‌కేఆర్, దేవరకద్ర వెన్న అసోసియేట్స్, గండేడ్‌కు సీహెచ్ సుధాకర్, హన్వాడ ఆర్‌టీవీఎస్– అసోసియేషన్, జడ్చర్ల కేసీకేఆర్ అసోసియేట్స్, కోయిల్‌కొండ కొవ్వూరి అసోసియేట్స్, మహబూబ్‌నగర్ వీవీసీ కంపెనీ, మూసాపేట కేబీఎల్ అసోసియేట్స్, మహమ్మదాబాద్ రేవంత్ కంపెనీ, మిడ్జిల్ గౌతం అసోసియేట్స్, నవాబుపేట బస్వరాజ్ కంపెనీ, రాజాపూర్ బలరాముడు కంపెనీ, జిల్లా మహిళా సమాఖ్య ఆడిట్‌ను పాత్రో కంపెనీ చేయాలని నిర్ణయించారు.

జిల్లాలో గ్రామైక్య సంఘాలు	479	స్వయం సహాయక సంఘాలు	11,276
మొత్తం సభ్యులు	1,22,390		

షెడ్యూల్ ప్రకారమే ఆడిట్



జిల్లాలోని మహిళ సంఘాలకు చెందిన ఆడిట్ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి జరుగుతుంది. ఎంపిక చేసిన ఏజెన్సీలకు ఆడిట్ చేయడానికి అప్పగించాం. షెడ్యూల్ ప్రకారమే ఆడిట్ నిర్వహిస్తారు. ఒకే ఏజెన్సీకి ఆడిట్ చేయడానికి అవకాశం ఇవ్వడం జరగదు. జిల్లా మహిళ సమాఖ్య ద్వారా ఏపీఎంలు, సీసీల పర్యవేక్షణలో ఈ ఆడిట్ జరుగుతుంది. ఇందులో ఎలాంటి అవకతవకలకు తావు ఉండదు.

– యాదయ్య, డీఆర్‌డీఓ

చెల్లింపులు ఇలా..

మండల మహిళా సమాఖ్య ఆడిట్‌కు రూ.1,500 ఫీజు చెల్లించేలా నిబంధనలు ఉన్నాయి. మండల మహిళా సమాఖ్యతో పాటు ఆ మండలంలో ఉన్న గ్రామైక్య సంఘాలు సైతం ఆడిట్ నిర్వహించాల్సి ఉంటుంది. గ్రామైక్య సంఘాల ఆడిట్ రూ.2 లక్షల లావాదేవీల వరకు రూ.500, రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు రూ.700, రూ.10 లక్షలకు పై ఉన్న గ్రామైక్య సంఘాల ఆడిట్ చేసేందుకు రూ.వెయ్యి చొప్పున చెల్లిస్తారు.

సర్వసభ్య సమావేశాలు..

జిల్లావ్యాప్తంగా సంఘాలకు చెందిన ఆడిట్ పూర్తయిన వెంటనే చిన్న సంఘాల నుంచి పెద్ద సంఘాల వరకు నాయకత్వ మార్పు జరుగుతుంది. జూన్ 30 నాటికి గ్రామైక్య సంఘాల స్థాయిలో ఆ సంఘాల సర్వసభ్య సమావేశాలు నిర్వహించి నాయకత్వ మార్పు చేయాలి. జూలై 15 నాటికి మండల మహిళా సమాఖ్యల సర్వసభ్య సమావేశాలు, సెప్టెంబర్ 30న జిల్లా మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం నిర్వహించాలి. ఇందులో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకొంటారు.

- గత నెల 20 నుంచి 31 వరకు ఆడిట్ నిర్వహించారు. జిల్లాలో మొత్తం 15 మండలాలు ఉండగా 11 మండలాలకు చెందిన ఆడిట్ పూర్తయ్యింది. రాజాపూర్, మిడ్జిల్, నవాబుపేట, జడ్చర్ల మండలాల్లో వీఓఏలు సమ్మె చేస్తున్న కారణంగా ఆడిట్ జరగలేదు.

నేడు పాలమూరుకు రామన్న



వేముల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

- మూడు నియోజకవర్గాల్లో పర్యటించనున్న మంత్రి కేటీఆర్
- జడ్చర్లలో డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం
- జిల్లాకేంద్రంలో స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమి పూజ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎస్పీ

జడ్చర్ల/మహబూబ్‌నగర్ క్రైం/జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/అడ్డాకుల: రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా మూడు నియోజకవర్గాల్లో పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టనున్నారు. కేటీఆర్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ నరసింహ పరిశీలించారు. పర్యటనలో భాగంగా మొదట మంత్రి కేటీఆర్ గురువారం ఉదయం 10.15 గంటలకు భూత్పూర్‌లో మున్సిపల్ పార్క్‌ను ప్రారంభిస్తారు. అక్కడి నుంచి 10:30 గంటలకు మూసాపేట మండలం వేములలో కోజెంట్ పరిశ్రమ కొత్త ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ అనంతరం ఉదయం 11:00 గంటలకు మహబూబ్‌నగర్ చేరుకొని స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. ఆ తర్వాత జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీ అయ్యప్ప గుట్ట సమీపంలో నిర్మించిన ఆధునిక వైకుంఠధామాన్ని ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం 1:45 గంటలకు జడ్చర్లలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభిస్తారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగసభలో పాల్గొంటారు.

- మూసాపేట మండలంలోని వేముల శివారులో ఉన్న ఎస్‌జీడీ ఫార్మా పరిశ్రమ వద్ద రూ.500 కోట్లతో కొత్త ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న స్థలంతో పాటు సభా ప్రాంగణ ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎస్పీ నరసింహ, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ కొత్త పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని తెలిపారు.మంత్రి కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో డీఎస్పీ మహేష్, జెడ్పీటీసీ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, పరిశ్రమ నిర్వాహకులు రాజమోహన్, వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.
- జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డలో బాలికల ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి కేటీఆర్ భూమి పూజ చేయనున్నారు. అనంతరం బాదేపల్లి శివారులోని ఎర్రగుట్ట ప్రాంతంలో నిర్మించిన 560 డబుల్ బెడ్‌రూం ఇళ్లను మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.నియోజకవర్గంలోని ప్రజలు ఆయా గ్రామాలలో చెరువుల పండుగను నిర్వహించిన తర్వాత మంత్రి కేటీఆర్ సభకు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ.. ఆదాయ'మస్తు'

- మహబూబ్‌నగర్ రీజియన్‌కు అధిక ఆదాయం
- 6వ తేదీన రూ.కోటి 91లక్షల రాబడి
- ఓఆర్‌లో రాష్ట్రంలోనే రీజియన్‌కు అగ్రస్థానం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ మహబూబ్‌నగర్ రీజియన్‌కు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈనెల 6వ తేదీన అధిక ఆదాయం వచ్చింది. మంగళవారం ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండడంతో మహబూబ్‌నగర్ రీజియన్‌లోని అన్ని డిపోల్లో కలిపి రూ.1,91,69,041 ఆదాయాన్ని ఆర్జించింది. రీజియన్‌లోని ఆర్టీసీ, ప్రైవేట్ హైర్ 842 బస్సులు 3,08,286 కిలోమీటర్ల మేర బస్సులు నడవగా ఈ ఆదాయం వచ్చింది. గతంలో రీజియన్‌లో ఒక రోజు అత్యధిక ఆదాయం రూ.కోటి 44 లక్షలు కాగా.. ఆ రికార్డును అధిగమించడం విశేషం. ఆక్యుపెన్సి రేషియోలో రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్ 105 శాతాన్ని సాధించి అగ్రస్థానంలో నిలవడం విశేషం. మంగళవారం రీజియన్‌లో 1,94,270 మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు. ఒక్కమహబూబ్‌నగర్ డిపోకే రూ.30,38,185 ఆదాయం వచ్చింది.

- మహబూబ్‌నగర్ డిపోకు రూ.30 లక్షలకు పైగా ఆదాయం రావడంపై బుధవారం డిపో మేనేజర్ సుజాత ఉద్యోగులను అభినందించారు. 98 శాతం ఆక్యుపెన్సి రేషియో రావడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఉద్యోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు రాంజీ, శ్రీకాంత్, ఎస్‌డీఐ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తుంది. ప్రయాణికులు ఆర్టీసీని ఆదరిస్తున్నందుకు ధన్యవాదాలు. ఉద్యోగులు కష్టపడి పని చేస్తున్నందుకు రీజియన్‌కు మంచి ఆదాయం వస్తుంది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరింత ఆదాయం తీసుకురావడానికి కృషి చేయాలి.

– శ్రీదేవి, ఆర్‌ఎం, మహబూబ్‌నగర్

6న డిపోల వారీగా వచ్చిన ఆదాయం (రూపాయల్లో)

డిపో	ఆదాయం	డిపో	ఆదాయం
మహబూబ్‌నగర్	30,38,185	షాద్‌నగర్	19,09,448
వనపర్తి	25,79,769	అచ్చంపేట	18,57,687
కల్వకుర్తి	25,27,275	నాగర్‌కర్నూల్	17,77,817
గద్వాల	20,68,462	కొల్లాపూర్	11,89,597
నారాయణపేట	20,53,432	కోస్గి	1,67,369

కాళేశ్వరం తరహాలో 'పాలమూరు'



ఇరిగేషన్ ప్రగతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, అడిషనల్ కలెక్టర్ సీతారామారావు, ఇరిగేషన్ అధికారులు

- వచ్చే ఏడాదికి పాలమూరు–రంగారెడ్డి ద్వారా నీళ్లు
- కాల్వ పనులకు త్వరలోనే టెండర్లు
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): తెలంగాణ రాక పూర్వం సాగునీటి సంగతి దేవుడు ఎరుగు.. తాగడానికి నీరు దొరికేవి కాదని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం జిల్లా నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో స్థానిక శిల్పారామంలో నిర్వహించిన 'సాగునీటి దినోత్సవానికి' ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఇంజినీర్లు కష్టపడి పనిచేసి రికార్డ్ టైంలో కాళేశ్వరాన్ని పూర్తి చేసినట్లే వచ్చే ఏడాదికి పాలమూరు–రంగారెడ్డిని పూర్తి చేయాలన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తయితే అద్భుతంగా ఉంటుందని, కరివేన, ఉదండాపూర్ రిజర్వాయర్లు పూర్తయితే మహబూబ్‌నగర్ జిల్లా సశ్యశ్యామలం అవుతుందన్నారు. రిజర్వాయర్లు పూర్తయితే త్వరలోనే కాల్వల నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులను పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో నిర్మించిన చెక్ డ్యాంల వల్ల భూగర్భ జలాలు పెరిగాయని, కోయిల్‌సాగర్‌ను గ్రావిటీ ద్వారా నింపనున్నామని, అదేవిధంగా జూరాల ప్రాజెక్టును తిరుగు జలాల ద్వారా నింపే ఆలోచనలో ఉన్నట్లు మంత్రి తెలిపారు. పాలమూరు – రంగారెడ్డి ద్వారా అన్ని చెరువులను నింపి వ్యవసాయానికి సాగునీటితో పాటు, చేప పిల్లల పెంపకాన్ని చేపడుతామన్నారు. కోర్టు కేసుల వల్ల ప్రాజెక్టు పనులు ఆలస్యమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో చేపట్టనున్న చెక్ డ్యాంల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలవాలని ఇంజినీరింగ్ అధికారులని ఆదేశించడమే కాక వచ్చే ఏడాదికి పనులు పూర్తి చేయాలన్నారు. గతంలో ఇరిగేషన్ శాఖకు ఎలాంటి గుర్తింపు ఉండేది కాదని, ఇప్పుడు అందరికన్నా అత్యంత అద్భుతంగా శాఖ పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. మన ఊరు–మన భవిష్యత్‌గా భావించి ఉద్యోగులు పనిచేయాలని అన్నారు. జిల్లా సాగునీటి ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ రమణారెడ్డి, పలువురు మాట్లాడారు. ఉత్తమ సేవలందించిన సాగునీటి శాఖ ఇంజినీర్లను మంత్రి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ నర్సింహులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, ఎస్ఈ చక్రధరం, ఈఈలు దయానంద్, వెంకటయ్య, పీఎస్‌సీఎస్ అధ్యక్షుడు రాజేశ్వరగౌడ్, డీఈ మనోహర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.6,868

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం వేరుశనగకు గరిష్టంగా రూ.6,868, కనిష్టంగా రూ.5,640 ధరలు లభించాయి. మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,834, కనిష్టంగా రూ.1,390, ఆముదాలు గరిష్టంగా రూ.5,469, కనిష్టంగా రూ.5,439, హంస రకం ధాన్యం గరిష్టంగా రూ.1,739, కనిష్టంగా రూ.1,210, ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2,369, కనిష్టంగా రూ.1,569, పొద్దుతిరుగుడు రూ.3,895 ధరలు లభించాయి.



ఎస్ఎల్‌బీసీని పరిశీలిస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, కాంగ్రెస్ నాయకులు

ప్రజలను దగా చేస్తున్న కేసీఆర్..

- పేదలకు భూములు లేకుండా చేయాలని కుట్ర
- అధికారంలోకి రాగానే ఎస్ఎల్‌బీసీ నిర్వాసితులను ఆదుకుంటాం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

– అచ్చంపేట

-పూర్తి వివరాలు 8లో..

పకడ్బందీగా గ్రూప్‌–1 పరీక్ష: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): గ్రూప్‌–1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో పరీక్ష నిర్వహణపై జిల్లా అధికారులు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశమయ్యారు. 11వ తేదీన ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్ష ఉంటుందని, జిల్లాలో 12,127 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ఇందుకుగాను 34 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 34 మంది లైజన్ అధికారులు, 34 మంది చీఫ్ సూపరింటెండెంట్లను నియమించామని, తగినంత మంది ఇన్విజిలెటర్లు ఉన్నట్లు తెలిపారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అధికారులు ఆయా కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రాలలో విద్యుత్, సరైన గాలి, వెలుతురు వచ్చే విధంగా ఉండాలని, అవసరమైన ఫర్నీచర్ ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆశ, ఏఎన్ఎం, ప్రథమ చికిత్స ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, టాయిలెట్ తదితరవి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ముందుగా గేటు వద్దే మహిళ, పురుష అభ్యర్థులకు వేర్వేరుగా తనిఖీ చేయాలన్నారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్ తీసుకు రాకూడదని, ఈ విషయంపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులను ఉదయం 8:30 గంటల నుంచి 10:15 గంటల లోపు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, అనంతరం గేట్లను మూసివేయాలని చెప్పారు. అభ్యర్థులకు సంబంధించిన వస్తువులను భద్రపరచుకునేందుకు క్లాక్ రూం ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామరావు చెప్పారు. బూట్లు కాకుండా చెప్పులే ధరించి రావాలన్నారు. అదనపు ఎస్పీ రాములు మాట్లాడుతూ అవసరమైన భద్రతను ఏర్పాటు చేస్తామని, పరీక్ష ప్రశాంతంగా రాసేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మల్లేష్ (ఫైల్)

ధన్వాడ: మండల కేంద్రంలోని కుర్వవీధికి చెందిన యువకుడు మల్లేష్(25) బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. మల్లేష్ ఇంటి పైకప్పు రేకులకు ఎర్తింగ్ ఉండటంతో కరెంట్ సరఫరా అయ్యింది. ఈ క్రమంలోనే ఫ్యాన్ స్విచ్ ఆఫ్ చేయడనికి వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్‌కు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ట్రాక్టర్ అదుపుతప్పి బాలుడి దుర్మరణం


మహేష్ (ఫైల్)

దామరగిద్ద: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడటంతో ఓ బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని మద్దెలబీడ్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మహేష్ (13) ట్రాక్టర్ తీసుకెళ్లి పొలం దున్నాడు. పూర్తయిన తర్వాత తిరిగి ఇంటికి వస్తుండగా పొలంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రధాన రహదారి పక్కనే ఘటన జరగటంతో రోడ్డుపై వెళ్తున్న పలువురు వెంటనే ట్రాక్టర్ కింది నుంచి బయటకు లాగగా అప్పటికే మృతిచెందాడు. 20 రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి గాయపడి చికిత్స పొందుతున్నారు. భర్త గాయపడటంతో తల్లి బాలుడిని ట్రాక్టర్ నడిపేందుకు తీసుకెళ్లింది. బాలుడు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏడోతరగతి పూర్తిచేశాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

నెట్టెంపాడు కాల్వలో మృతదేహం లభ్యం

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల ప్రధాన కాల్వలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బుధవారం సాయంత్రం అటుగా వెళ్తున్న జాంపల్లి గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతి చెందిన వ్యక్తికి 40 ఏళ్లు ఉంటాయని, రాత్రి పొద్దుపోవడంతో గద్వాల ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్‌ఫోన్ నంబర్ 87126 70293లో సంప్రదించాలని సూచించారు.

వివాహిత బలవన్మరణం

మహమ్మదాబాద్: అత్త, భర్త, బావ పోరు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని నంచర్లగేట్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నంచర్లగేట్‌కు చెందిన మౌనిక (22)కు నరేష్‌తో మూడేళ్ల కిందట వివాహమైంది. మౌనికకు మొదటి నుంచి మధుమేహం వ్యాధి ఉండటంతో రోజూ మాత్రలు వేసుకునేది. ఉమ్మడి కుటుంబంలో ఆమెను భర్తతో పాటు అత్త వీరమణి, బావ అశోక్ నిత్యం సూటిపోటి మాటలతో పాటు శారీరకంగా వేధించే వారు. రెండు పర్యాయాలు గర్భం దాల్చినా విచ్ఛిన్నం చేయించారు. దీంతో మనస్తాపానికి గురైన మౌనిక షుగర్ మాత్రలను మోతాదుకు మించి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అక్క కమ్మరి శాంతి ఫిర్యాదు మేరకు భర్త, అత్త, బావపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో గుప్త నిధుల తవ్వకాల ముఠా?

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పోలీసుల అదుపులో గుప్తనిధుల తవ్వకాల ముఠా ఉన్నట్లు బుధవారం పట్టణంలో జోరుగా చర్చ జరిగింది. పాపనాశేశ్వర ఆలయం మార్గమధ్యంలోని మొబ్బుమఠంలో ఉన్న శివలింగాన్ని ఇటీవల ఎత్తుకెళ్లారని ఓ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు సమాచారం. మొబ్బుమఠం తమ పరిధిలోకి రాదని అటు దేవాదాయశాఖ ఇటు రాష్ట్ర, కేంద్ర పురావస్తుశాఖ చెబుతుండటంతో పోలీసులు ఏం చేయాలో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఎస్‌ఐ మహేందర్ వద్ద ప్రస్తావించగా వివరాలు సేకరిస్తున్నామని.. పూర్తి సమాచారం తీసుకున్న తరువాత వెల్లడిస్తామని సమాధానమిచ్చారు.

బంగార గొలుసు చోరీ

వనపర్తి: ఇంట్లో తలగడ కింద దాచిన 38 గ్రాముల బంగారు గొలుసు కనిపించడం లేదని జిల్లాకేంద్రంలోని కేడీఆర్‌నగర్ ప్రాంతానికి చెందిన గోపీనాథ్ బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పనిమనిషిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొనడంతో కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడు అదృశ్యం

వనపర్తి: జిల్లాకేంద్రంలోని నాగవరం కాలనీకి చెందిన రవినాయక్, సంధ్య కుమారుడు పద్నాలుగేళ్ల దినేష్ బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చీకటి పడే వరకు ఇంటికి రాకపోవడం.. కాలనీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు.

ఇదేం చోద్యం..?

పూర్తయిన పనులకు టెండర్ నిర్వహించిన నీటిపారుదలశాఖ


పూడిక, పిచ్చిమొక్కలు తొలగించిన జూరాల ప్రధాన ఎడమ కాల్వ

- పూడిక లేకున్నా పనులు చేపడుతున్న వైనం
- జూరాల ప్రధాన ఎడమకాల్వ పూడికతీతకు రూ.24.82 లక్షలతో టెండర్ ఆహ్వానం

వనపర్తి: వడ్డించేవాడు మనోడైతే బంతిలో ఎక్కడ కూర్చుంటేనేమి అన్నట్లుంది ఇరిగేషన్ అధికారుల వ్యవహారం. నెలల క్రితమే పూర్తయిన పనులకు ఇటీవల టెండర్ ప్రక్రియ నిర్వహించి పనులు అప్పగించిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లావ్యాప్తంగా ప్రాజెక్టుల సాగునీటి కాల్వల్లోని పూడికతీత ఉపాధి కూలీలతో చేయిస్తున్న విషయం తెలిసిందే. ఈ విధానం అమలులోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్‌శాఖలో డీసిల్టింగ్ పనులకు టెండర్లు దాదాపుగా తగ్గిపోయాయని చెప్పవచ్చు. కానీ చిన్నంబావి మండలంలో లక్ష్మీపల్లి ఇరిగేషన్ సర్కిల్ 0/0 నుంచి 15 కిలోమీటర్ల వరకు జూరాల ప్రధాన ఎడమకాల్వలో పూడికతీతకు మే నెలలో రూ.24.82 లక్షలకు టెండర్ ప్రక్రియ నిర్వహించారు. కానీ కొన్ని నెలల క్రితమే ఇరిగేషన్ అధికారులు, రైతుల భాగస్వామ్యంతో కాల్వలోని పూడికను పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం శుభ్రంగా ఉన్న కాల్వలో పూడిక తొలగింపునకు టెండర్ ఇవ్వడం ఏమిటని రైతులు, ఆ ప్రాంతంలోని నాయకులు, విషయం తెలియని ఇరిగేషన్‌శాఖలోని పలువురు ఉద్యోగులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఇది ఏ రకమైన టెండర్ అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పనులు పూర్తిచేసిన తర్వాత టెండర్లు నిర్వహించే సంప్రదాయం ఇరిగేషన్‌శాఖలో కొనసాగటం శోచనీయం. నిబంధనలకు నీళ్లు వదులుతూ.. పూడికతీత పనులు చేయించిన వ్యక్తికే టెండర్ రావటం ఎలా సాధ్యమైందనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని.. సమగ్ర విచారణ జరిపి సంబంధిత ఉన్నతాధికారులు పూర్తి వివరాలు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది.

శుభ్రంగా ఉన్న కాల్వల్లో పూడికతీత..

జూరాల ప్రధాన ఎడమకాల్వలో పూడిక, జమ్ము, చెత్త, వ్యర్థాలను తొలగించిన ప్రదేశంలోనే రెండురోజుల క్రితం నుంచి తూతూమంత్రంగా పనులు చేపడుతున్నారని.. అధికారులు పనులు ప్రారంభించారని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. శుభ్రంగా ఉన్న కాల్వలో మళ్లీ పనులు చేయడం బిల్లులను డ్రా చేసుకునేందుకేనా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇదివరకే చేసిన పనులకు టెండర్ పిలవడం, అందులో అయిదుగురు పాల్గొనట్లుగా ప్రక్రియను నిర్వహించటం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

➡ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏవైనా అభివృద్ధి పనులు చేపట్టాలంటే ముందుగా అందుకు సంబంధించిన అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపాలి. అనంతరం ఆ శాఖ నుంచి నిధులు మంజూరైన తర్వాత టెండర్ ప్రక్రియ నిర్వహించాలి. టెండర్ పూర్తయిన తర్వాత అగ్రిమెంట్ చేసుకొని పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ మాత్రం అవేమీ పట్టించుకోకుండా పనులు చేపట్టి తర్వాత టెండర్ నిర్వహించడం.. అదికూడా పనులు చేసిన వ్యక్తికే టెండర్ దక్కడం ఆశ్చర్యంగా ఉంది.

చేసిన పనులకు టెండర్..



కొంతకాలం క్రితమే రైతులు, ఇరిగేషన్ అధికారులు కలిసి జూరాల ప్రధాన ఎడమకాల్వలోని పూడికతీత పనులు చేపట్టారు. పూర్తయిన పనులకు మే నెలలో టెండర్ నిర్వహించారు. ఎస్టిమేషన్‌లో పేర్కొన్న ప్రదేశంలో కాల్వను చూస్తే ఇదివరకే దురస్తు చేసినట్లుగా కనిపిస్తుంది.

– విష్ణు, కాలూరు, చిన్నంబావి మండలం

విచారణ చేపట్టాలి..



చేసిన పనులకు టెండర్ నిర్వహించిన అంశంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలి. ఇలా ఎందుకు చేస్తున్నారో ప్రజలకు వెల్లడించాలి. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు సైతం స్పందించాలి.

– స్వాములు, చిన్నంబావి

అత్యవసరమని ముందే చేయించాం..

యాసంగిలో సాగునీరు ముందుకు పారడం లేదని రైతులు ఇబ్బంది పడుతుంటే జూరాల ప్రధాన ఎడమ కాల్వ, డిస్ట్రిబ్యూటరీ కాల్వల్లో పూడిక అత్యవసరంగా తీయించాల్సి వచ్చింది. ఇప్పుడు టెండర్ పిలిచి అతడితోనే మిగిలిన మొత్తం పని చేయిస్తున్నాం.

– సత్యశీలారెడ్డి, ఎస్‌ఈ, నీటిపారుదలశాఖ

'గులాబీ' శ్రేణుల్లో జోష్..

సీఎం సభ సక్సెస్‌తో బీఆర్‌ఎస్ నేతల్లో నూతనోత్సాహం

- జన సమీకరణపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం
- 'పాలమూరు'పై ప్రకటనతో ఆశలు సజీవం



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ బహిరంగ సభ గులాబీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లా పర్యటన విజయవంతం కావడం, బహిరంగ సభకు చేపట్టిన జన సమీకరణపట్ల సీఎం కేసీఆర్ సంతృప్తివ్యక్తం చేయడంతో బీఆర్‌ఎస్ పార్టీలో జోష్ నింపినట్లయింది. ప్రధానంగా కేసీఆర్ బహిరంగ సభకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి జనాన్ని సమీకరించడాన్ని ఎమ్మెల్యేలు కీలకంగా తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు జిల్లాలో సీఎం చేపట్టిన టూర్‌ను బీఆర్‌ఎస్ పార్టీ సద్వినియోగం చేసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో సీఎం పర్యటన తమకెంతో కలసివస్తుందని జిల్లా ఎమ్మెల్యేలు అంచనా వేస్తున్నారు.

ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలపై ప్రస్తావన ఏది..?

జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల ఏర్పాటైంది. అలాగే ఇంజినీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటుచేయనున్నట్లు, సీఎం కేసీఆర్ నుంచి మంజూరు చేయిస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించారు. అయితే సభలో సీఎం కేసీఆర్ వీటి ఏర్పాటుకు ఎలాంటి ప్రస్తావన చేయలేదు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుతో ఇక్కడి విద్యార్థులు హైదరాబాద్ వరకు వెళ్లాల్సిన ఇబ్బంది లేకుండా స్థానికంగానే అందుబాటులోకి వచ్చేది. కళాశాల మంజూరు ప్రకటన రాకపోవడం నిరాశకు గురిచేసింది.

హామీలు నెరవేర్చలే: ప్రతిపక్షాలు

సీఎం కేసీఆర్‌కు పాలమూరుకు ఇచ్చిన హామీలేవి నెరవేర్చలేదని కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మండిపడ్డాయి. ఇప్పటివరకు పాలమూరు ప్రాజెక్టుతో పాటు ఏ ఒక్క ప్రాజెక్టును పూర్తిచేయలేకపోయారని, ఇచ్చిన హామీలేవీ అమలులోకి రాలేదని ప్రతిపక్ష నేతలు చెబుతున్నారు. కనీసం సీఎం పర్యటన సందర్భంగానైనా జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు సాధించలేకపోయారని విమర్శలు గుప్పిస్తున్నారు.

ప్రాజెక్టులపై స్పష్టత..

ఉమ్మడి పాలమూరు జిల్లాకు ఆశాదీపమైన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసే విషయమై సీఎం కేసీఆర్ సభ నుంచి స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలో నార్లాపూర్, ఏదుల రిజర్వాయర్లను నింపనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. అలాగే అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్, పదర మండలాలకు నీరందించేందుకు ఉమామహేశ్వర ప్రాజెక్టుకు రూ. 2వేల కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు, త్వరలోనే పనులను ప్రారంభించబోతున్నట్లు ప్రకటించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపై సీఎం నుంచి హామీ లభించడంతో గులాబీ నేతల్లో ఉత్సాహం నెలకొంది. అలాగే గృహలక్ష్మి పథకం కింద సొంత జాగా ఉన్న పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల సాయం ఇస్తుండగా, ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు నాలుగు వేల ఇళ్లను మంజూరు చేయడం తమకు మరింత కలసివస్తుందని పార్టీశ్రేణులు భావిస్తున్నాయి.

మంత్రి గారూ.. దయచూపరూ...!


దేవరకద్ర పట్టణ వ్యూ

దేవరకద్రను పురపాలికగా ప్రకటించాలంటూ వేడుకోలు

- గతేడాది భూత్పూర్ బహిరంగసభలో ఇచ్చిన హామీ నెరవేర్చాలని వినతి

దేవరకద్ర: దేవరకద్ర గ్రామపంచాయతీ పురపాలికగా ఎప్పుడు మారుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గతేడాది జూన్ 4న భూత్పూర్‌లో జరిగిన బహిరంగసభలో రాష్ట్ర పురపాలికశాఖ మంత్రి కేటీఆర్ దేవరకద్రకు మున్సిపాలిటీ హోదా కల్పించి.. కావాల్సిన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామపంచాయతీ కాలపరిమితి ముగిసిన తరువాత మున్సిపాలిటీగా మారుస్తామని వేదికపై ప్రకటించారు. హామీ ఇచ్చి ఏడాది పూర్తయింది. ప్రస్తుతం జిల్లా పర్యటనకు వస్తున్న మంత్రి ఈ విషయంపై ఎలాంటి ప్రకటన చేస్తారోనని స్థానిక నాయకులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

అధికారుల వైఫల్యమేనా?

జిల్లాల పునర్విభజన సమయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాను అయిదు జిల్లాలుగా విభజించారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లాలో మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాలు మాత్రమే మిగిలాయి. ఇందులో ఇప్పటికే మహబూబ్‌నగర్, జడ్చర్ల మున్సిపాలిటీలుగా ఉన్నాయి. అలాగే నియోజకవర్గంలోని భూత్పూర్, కొత్తకోటకు, పాత అమరచింత నియోజకవర్గంలోని ఆత్మకూర్, అమరచింతకు మున్సిపాలిటీ హోదా ఇచ్చారు. కాని దేవరకద్ర నేటికీ మేజర్ గ్రామపంచాయతీగానే కొనసాగుతోంది. అధికారులు, ప్రజాప్రతినిధుల వైఫల్యంతోనే పుర హోదా దక్కలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాలుగు గ్రామాలతో ప్రతిపాదన..

2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణంలో 8,047 జనాభా ఉంది. ఇప్పటి లెక్కల ప్రకారం సుమారు 14 వేల వరకు ఉంటుందని అంచనా. అయితే మున్సిపాలిటీగా ప్రకటించాలంటే కనీసం 15 వేల జనాభా అవసరం ఉండటంతో చుట్టుపక్కల ఉన్న పెద్దగోప్లాపూర్, బల్సుపల్లి, మినుగోనిపల్లి, చౌదర్‌పల్లిని విలీనం చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం మండల అధికారులు ఆయా గ్రామాల నుంచి తీర్మానాలు తీసుకొని నివేదికను సిద్ధం చేసి జిల్లా పంచాయతీ అధికారికి పంపించారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కూడా లేఖ ఇవ్వడంతో దానిని జతచేసి పుర కమిషనరేట్‌కు ఫైల్‌ను ఈ ఏడాది ప్రారంభంలోనే పంపించారు.

మేజర్ గ్రామపంచాయతీగానే..



అయిదు దశాబ్దాలుగా దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీగానే కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలోని మేజర్ పంచాయతీలన్నీ ఇప్పటికే మున్సిపాలిటీలుగా మారాయి. మారుమూల చిన్న పట్టణాలకు సైతం మున్సిపాలిటీ హోదా ఇచ్చారు. పాలకుల చిన్నచూపు కారణంగానే ఆలస్యమవుతోంది.

– సాంబశివుడు, జిల్లా నాయకుడు, ఇఫ్టూ

పాలకులు దృష్టి సారిస్తేనే..



జిల్లాల పునర్విభజన తరువాత చిన్న పట్టణాలు సైతం మున్సిపాలిటీలుగా మారాయి. జిల్లాలో ఉన్న మూడు నియోజకవర్గాల్లో మహబూబ్‌నగర్, జడ్చర్ల ఇప్పటికే మున్సిపాలిటీలుగా ఉన్నాయి. ఒక్క దేవరకద్రకు ఆ హోదా దక్కలేదు. పాలకులు ఈ విషయంలో శ్రద్ధ చూపాలి.

– అరుణ్, వ్యాపారి, దేవరకద్ర

ప్రజలను దగా చేస్తున్న కేసీఆర్..


ఎస్‌ఎల్‌బీసీ వద్ద సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర

- పేదలకు భూములు లేకుండా చేయాలని కుట్ర
- అధికారంలోకి రాగానే ఎస్‌ఎల్‌బీసీ నిర్వాసితులను ఆదుకుంటాం
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

అచ్చంపేట: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజలు దగా పడుతున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం అచ్చంపేట మండలం జోగ్యతండా నుంచి ఎస్‌ఎల్‌బీసీ, మర్లపాడుతండా, మన్నెవారిపల్లి మీదుగా పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సాగింది. మన్నెవారిపల్లిలో వర్షంలోనే కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఎస్‌ఎల్‌బీసీ కింద భూములు కోల్పోయిన నిర్వాసితులను ఆదుకొంటామని, పోడు భూములకు హక్కు కల్పించి పట్టా పుస్తకాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ధరణి లేక ముందు రైతులకు పాసు పుస్తకాలు లేవా ఇప్పుడే ఇచ్చినట్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేదలకు భూములు లేకుండా చేయలేనే కుట్ర దాగి ఉందన్నారు. ఉపాధి హామీ కూలీకి వెళ్తే రెండు నెలలుగా కూలీ డబ్బులు రావడం లేదన్నారు. గ్రామాల్లో సర్పంచులు పనులు చేసిన బిల్లులు రావడం లేదని, అప్పులు చేసి సర్పంచులు పనులు చేశారని చెబుతున్నారని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నందుకు నిరసనగా నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు బీఆర్‌ఎస్ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల ఇళ్ల వద్దకు వెళ్లి నిలదీయాలని కోరారు. నీళ్లు సాధించుకోవడం మన హక్కు. మన హక్కును కాలరాస్తున్న బీఆర్‌ఎస్ పాలకులను నిలదీయకుంటే ఇంకా నష్టపోతామన్నారు. నాలుగు నెలల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జలయజ్ఞంలోని పెండింగ్ ప్రాజెక్టులన్నింటిపై సమీక్ష నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సాగు, తాగు నీరు అందిస్తామన్నారు.

పేదల భూములు ధరణిలో కనిపిస్తున్నాయా: మల్లురవి

కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన పోడు, మాన్యం, అసైన్డ్ భూములు.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణిలో కనిపించకుండా చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి ఆరోపించారు. ధరణి వల్ల రైతులు నష్టపోతున్న మాట వాస్తవం కాదా..? దీనిపై కాంగ్రెస్ పార్టీ చర్చకు సిద్ధంగా ఉందన్నారు. నాగర్‌కర్నూల్ సభలో సీఎం కేసీఆర్ కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టుల్లో మిగిలిపోయిన పనులను పూర్తి చేస్తానని ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.

■ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు సస్యశ్యామలం అయిందని నాగర్‌కర్నూల్ సభలో సీఎం కేసీఆర్ చెప్పడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ పేర్కొన్నారు., అచ్చంపేట నియోజకవర్గంలో కేఎల్‌ఐ ద్వారా 75 వేల ఎకరాలకు కాదుకదా 6 వేల ఎకరాలకు నీళ్లు ఇచ్చినట్టు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకుండా తాను తప్పుకుంటానని చెప్పారు. అచ్చంపేట గడ్డ.. బాలరాజు అడ్డా..అడ్డుకునేది ఎవరంటూ విర్రవీగుతున్న ఎమ్మెల్యే బాలరాజును ఆరు నెలల తర్వాత నియోజకవర్గ ప్రజలు ఎన్నికల్లో ఓడించి ఎస్‌ఎల్‌బీసీ కాల్వలో పడేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నిరంజన్‌తోపాటు రాహుల్‌రెడ్డి,మాధవరెడ్డి, అంతటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయొద్దు


మైసమ్మకు హామీ పత్రం అందిస్తున్న ఫోరం సభ్యులు

నవాబుపేట: తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాలని వారిని నిర్లక్ష్యం చేయకూడదని సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యుడు నర్సింహులు, ఏఎస్‌ఐ ఆనంద్ ఓ కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలోని యన్మన్‌గండ్లకు వృద్ధురాలు కొల్లూర్ మైసమ్మ కుమారుడు నర్సింహులు పట్టించుకోకపోవడంతో, కూతురు పద్మతో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఉంటుంది. పద్మ భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లి పోషణ ఆమెకు ఇబ్బందిగా మారింది. దీంతో కుమారుడికి చెప్పినా పట్టించుకోలేదు. వృద్ధుల హెల్ప్‌లైన్ నంబర్ 14567కు సమాచారం ఇచ్చారు. జిల్లా అధికారుల ఆదేశాలతో సీనియర్ సిటిజన్‌లు, పోలీసులు కల్పించుకుని బుధవారం మండల కేంద్రంలో తల్లి, కుమారుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తల్లి పోషణకు నెలకు రూ.3వేలు, ఆమె బాగోగులు చూస్తానని అధికారుల ఎదుట హామీ ఇచ్చారు. సీనియర్ సిటిజన్ ఫోరం సభ్యులు నాగభూషనం, చంద్రశేఖర్, వెంకటేశ్వరప్ప, పండారినాథ్, హన్మంతు తదితరులు ఉన్నారు.

ఆన్‌లైన్ మోసం

కల్వకుర్తి టౌన్: ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్‌లో ఓ యువతిని బురిడీ కొట్టించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆ వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మరాశిపల్లి వార్డుకు చెందిన యువతి ప్రియాంక కొన్నిరోజుల కిందట యూట్యూబ్‌లో వీడియో చూసి ఉద్యోగానికి దరఖాస్తు చేసింది. కొంత డబ్బు చెల్లిస్తే ఉద్యోగం వస్తుందని ఆన్‌లైన్‌లోనే ప్రియాంకకు మెసేజ్ వచ్చింది. ఇలా మూడు విడతలుగా ఆమె నుంచి మోసగాళ్లు రూ.97వేలు వసూలు చేశారు. నెల గడుస్తున్నా ఉద్యోగం రాకపోవటంతో యువతి మోసపోయాయనని గ్రహించి హైదరాబాద్ సైబర్ క్రైంలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తాము బుధవారం కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ రమేష్ తెలిపారు

నిలకడగా ఉల్లి ధరలు

- క్వింటాల్ గరిష్ట ధర రూ.1,200
- కనిష్టంగా రూ.950


దేవరకద్ర మార్కెట్‌లో తూకం వేస్తున్న ఉల్లి

దేవరకద్ర: ఉల్లి ధరలు నిలకడగానే కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఉల్లి సీజన్ ప్రారంభం కాగా గత అయిదు నెలలుగా ఉల్లి ధర రూ.వెయ్యికి అటూ ఇటుగానే నమోదవుతోంది. ప్రస్తుతం ఉల్లి సీజన్ ముగుస్తున్నా ధరలు పెరగడంలేదు. దేవరకద్ర మార్కెట్‌లో వారానికి ఒకసారి జరిగే ఉల్లిపాయల బహిరంగవేలం బుధవారం జరిగింది. వివిధ గ్రామాల నుంచి రైతులు వెయ్యిబస్తాల వరకు ఉల్లిని అమ్మకానికి తెచ్చారు. కొందరు మార్కెట్‌లో వేలం వేయడానికి కుప్పలుగా పోయగా, మరి కొందరు రైతులు ఉల్లి బస్తాలను తెచ్చి మార్కెట్ బయటే విక్రయించారు. మార్కెట్‌లో జరిగిన వేలంలో ఉల్లి ధర గరిష్టంగా రూ.1,200, కనిష్టంగా రూ.950 వరకు పలికింది. 45కేజీల ఉల్లి బస్తా ఎక్కువగా రూ.600, తక్కువగా రూ.500 వరకు విక్రయించారు. ఇక మార్కెట్ బయట కూడా రైతులు ఆ ధరకే ఉల్లిని అమ్ముకున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మార్కెట్‌లో, మార్కెట్ బయట ఉల్లివ్యాపారం పోటాపోటీగా జరిగింది.

పిడుగుపడి రూ.2లక్షల ఆస్తినష్టం

కల్వకుర్తి రూరల్: మండలంలోని గుండూరులో బుధవారం సాయంత్రం పిడుగుపడి గ్రామానికి చెందిన పుల్లయ్య గుడిసె దగ్ధమైంది. రూ.2లక్షల ఆస్తినష్టం జరిగింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన చిన్నపాటి వర్షం కురిసింది. అదే సమయంలో పుల్లయ్య బావివద్ద ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగు పడింది. మంటలు అంటుకుని పక్కనే ఉన్న గుడిసెపై పడడంతో గుడిసెలో నిలువ ఉన్న ఉల్లిగడ్డ, స్ప్రింక్లర్ పైపులు, డ్రిప్ పైపులు కాలిబూడిదయ్యాయి. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు పుల్లయ్య వేడుకుంటున్నాడు.

1,019 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో బు.దవారం నీటిమట్టం 1,019 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వకు వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వ నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగికి 'గ్యారంటీ' భరోసా

సీపీఎస్‌తో పోలిస్తే మరింత మెరుగ్గా జీపీఎస్

- రిటైర్‌మెంట్ తర్వాత చివరి నెల బేసిక్‌లో 50 శాతం మొత్తం పెన్షన్‌తో పాటు ఏటా 2 డీఆర్‌లు
- త్వరలో 12వ పీఆర్సీ ఏర్పాటు
- 10వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ
- 6,840 కొత్త పోస్టుల మంజూరు
- ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ విలీనం
- మంత్రివర్గ సమావేశం అనంతరం మీడియాకు వెల్లడించిన మంత్రి వేణుగోపాలకృష్ణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత, కాంట్రాక్టు, సీపీఎస్ ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ అందించేలా గ్యారంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్)ను రూపొందించింది. దీనిద్వారా ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత చేకూరనుంది. రిటైర్ అయిన ఉద్యోగి చివరి నెల మూలవేతనంలో 50 శాతం పెన్షన్, ప్రతి ఆర్నెల్లకు ఒకసారి కరువు భృతి (డీఆర్) ఇవ్వడం ద్వారా మెరుగైన పెన్షన్‌ను అందించనుంది. దీంతోపాటు ఉద్యోగులు అడగకుండానే 12వ పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటుతోపాటు 10 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ లాంటి కీలక అంశాలకు బుధవారం సచివాలయంలో సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అనంతరం సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మీడియాకు వివరాలు వెల్లడించారు. మాటప్రకారం సీఎం జగన్ కాంట్రాక్టు ఉద్యోగుల దశాబ్దాల కలను నెరవేర్చారని చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు, ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జీపీఎస్‌ను తీర్చిదిద్దినట్లు వివరించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పూర్తి భద్రతనిచ్చేలా రూపొందించిన జీపీఎస్ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంత్రి వేణు ఇంకా ఏమన్నారంటే..

జీపీఎస్‌తో గ్యారంటీ ఇలా..

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీపీఎస్ విధానం ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్‌కు పూర్తి గ్యారంటీ ఇస్తుంది. ఇందులోనూ సీపీఎస్‌లో చెల్లించినట్లే ఉద్యోగి 10 శాతం పెన్షన్ వాటాగా చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే కడుతుంది. ఉద్యోగ విరమణ సమయంలో చివరి జీతంలో బేసిక్‌లో 50 శాతం పెన్షన్‌గా అందుతుంది. ఇక్కడ సీపీఎస్‌తో పోలిస్తే పెన్షన్ 150 శాతం అధికంగా ఉంటుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఆర్నెళ్లకు ఒకసారి ప్రకటించే డీఏలను పరిగణనలోకి



తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రెండు డీఆర్‌లు ఇస్తుంది. ఉదాహరణకు రిటైరైన ఉద్యోగి చివరి నెల బేసిక్ జీతం రూ.లక్ష ఉంటే అందులో రూ.50 వేలు పెన్షన్‌గా వస్తుంది. ఏడాదికి రెండు డీఆర్‌లతో కలుపుకొని ఇది ఏటా పెరుగుతుంది. 62 ఏళ్లకు రిటైర్ అయ్యే వ్యక్తి మరో ఇరవై ఏళ్ల తర్వాత అంటే 82 ఏళ్ల వయసులో జీపీఎస్ ద్వారా రూ.1,10,000 పెన్షన్‌గా తీసుకుంటారు. తద్వారా రిటైర్డ్ ఉద్యోగి జీవన ప్రమాణాలను కాపాడినట్లు అవుతుంది. సీపీఎస్‌లో ఇలాంటి వెసులుబాటు లేదు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇది 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ వర్తిస్తుంది. కటాఫ్ తేదీకి 10 ఏళ్లు ఉండాలని అధికారులు సిఫార్సు చేస్తే సీఎం జగన్ ఐదేళ్లకు తగ్గించారు. జిల్లాల పునర్విభజన తర్వాత కొత్త జిల్లాల్లోనూ ఒకేలా హెచ్‌ఆర్‌ఏ ఉండేందుకు అన్ని జిల్లా కేంద్రాల్లో 16% హెచ్‌ఆర్‌ఏ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 2022 జనవరి 1వతేదీ నుంచి డీఏ, డీఆర్ 2.73 శాతం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల ప్రభుత్వంపై నెలకు రూ.200 కోట్ల అదనపు భారం పడనుంది.

6,840 కొత్త పోస్టుల మంజూరు

నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభ వార్త తెచ్చింది. వివిధ శాఖల్లో సుమారు 6,840 కొత్త పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదించింది. వీటిల్లో 3,920 రిజర్వ్ పోలీసు ఉద్యోగాలు సహా నూతన వైద్య కళాశాలలు, పలు విద్యా సంస్థల్లో భారీ ఎత్తున కొత్త పోస్టులను కల్పించింది. ఏపీ వైద్య విధాన పరిషత్ 1986 యాక్ట్‌ను రద్దు చేసి 'డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్' శాఖగా మార్చి ప్రభుత్వంలో విలీనం చేయడానికి వీలుగా చట్ట సవరణకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వైద్య విధాన పరిషత్ స్వయం ప్రతిపత్తి నుంచి ప్రభుత్వంలోకి మారడం ద్వారా 14,658 మంది ఉద్యోగులకు మేలు జరుగుతుంది. వీరికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే 010 పద్దు కింద వేతనాలను చెల్లించనుంది.

విచారణకు శైలజ కిరణ్ సహకరించలేదు

పదే పదే ఆటంకాలు కల్పించారు

- ప్రశ్నించే అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి సిబ్బంది ప్రయత్నించారు..
- 25% విచారణ కూడా పూర్తి కాలేదు.. చట్టానికి లోబడే మార్గదర్శి కేసు విచారణ
- శైలజతోపాటు రామోజీని మరోసారి విచారిస్తాం
- త్వరలో మార్గదర్శి నిధుల ఆటాచ్‌మెంట్ కోసం పిటిషన్
- చందాదారుల ప్రయోజనాల పరిరక్షణకే నిధుల అటాచ్‌మెంట్
- సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్

సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో నిందితులుగా ఉన్న చెరుకూరి రామోజీరావు, శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించడంలేదని, అయినప్పటికీ తాము చట్టానికి లోబడే విచారణ జరుపుతున్నామని సీఐడీ అదనపు ఎస్పీ రవికుమార్ స్పష్టం చేశారు. ఈనాడు, ఈటీవీ మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగానే సీఐడీ విచారణపై నిరాధార ఆరోపణలతో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. ఆయన బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఐడీ ఐజీ సీహెచ్ శ్రీకాంత్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాము శైలజ కిరణ్‌ను ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని, ఆమె పట్ల పూర్తి మర్యాదతో వ్యవహరించామని చెప్పారు. ఆమె భోజనం, టీ, మందుల కోసం అవసరమైన ప్రతిసారీ అవకాశం కల్పించామన్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడినట్టు కచ్చితమైన ఆధారాలు లభించాయని రవికుమార్ స్పష్టం చేశారు. విచారణ కోసం మంగళవారం శైలజ కిరణ్ నివాసానికి వెళ్లినప్పుడు తమ సిబ్బందిలోని 10 మందిని అనుమతించకుండా అభ్యంతరం తెలిపారన్నారు. ఆర్థిక అక్రమాలను సంబంధించి ఆధారాలపై ప్రశ్నించాల్సిన సాంకేతిక అధికారులను అడ్డుకునేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది ప్రయత్నించారని తెలిపారు. తాము చట్టం పరిధిలోనే విచారిస్తున్నప్పటికీ శైలజ కిరణ్ విచారణకు ఏమాత్రం సహకరించకుండా పదే పదే ఆటంకాలు కల్పించేందుకు యత్నించారని చెప్పారు. అక్రమాలకు పాల్పడిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఎండీగా పూర్తి సమాచారాన్ని ఆమె వద్ద ఉంచుకోలేదని, ఇది ఉద్దేశపూర్వకంగానే చేశారని తెలిపారు. ఎండీ వద్ద పూర్తి సమాచారం ఉండాల్సిన అవసరం లేదని కూడా ఆమె వ్యాఖ్యానించారని చెప్పారు. చట్టానికి విరుద్ధంగా నిధుల మళ్లింపుపై వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఆమె పదే పదే ప్రయత్నించారన్నారు. విచారించిన ప్రతిసారీ ఏదో సాకుతో తప్పించుకోవాలన్నదే ఆమె ఉద్దేశంగా ఉందన్నారు. శైలజ కిరణ్ పదే పదే ఆటంకాలు కల్పిస్తుండటంతో తాము అడగాల్సిన ప్రశ్నల్లో 25 శాతం కూడా అడగలేకపోయామని వివరించారు. అందుకే మరోసారి నోటీసులు జారీ చేసి ఆమెను విచారిస్తామని తెలిపారు. ఈ కేసులో రామోజీరావును కూడా మరోసారి విచారిస్తామని చెప్పారు. చందాదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు మార్గదర్శి చిట్‌ఫండ్స్ నిధులు రూ.793.50 కోట్లను ఆటాచ్ చేసేందుకు న్యాయస్థానంలో త్వరలోనే పిటిషన్ దాఖలు చేస్తామని ఆయన తెలిపారు.


మీడియాతో మాట్లాడుతున్న సీఐడీ అధికారులు రవికుమార్, శ్రీకాంత్

ప్రాణం తీసిన పోలీసుల తనిఖీలు

డ్రంకెన్ డ్రైవ్‌కు భయపడి రాంగ్‌రూట్లో వెళ్లిన యువకుడు

- ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతి
- కరీంనగర్ జిల్లాకేంద్రంలో ఘటన.. స్థానికుల రాస్తారోకో


శ్రీనివాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం: పోలీసుల తనిఖీలు యువకుడి ప్రాణాలు తీశాయి. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులను చూసి బైక్ వెనక్కి తిప్పి రాంగ్‌రూట్లో వేగంగా వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్డులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. జిల్లాలోని హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన ఎలువాక శ్రీనివాస్(33) పదేళ్లుగా స్థానిక విద్యానగర్‌లో ఉంటూ వెల్డింగ్ పనులు చేస్తున్నాడు. తన సోదరుడి కూతురు పుట్టినరోజు శుక్రవారం ఉండడంతో బుధవారం రాత్రి పనులు పూర్తిచేసుకుని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరాడు. నగరంలోని కోతిరాంపూర్ చౌరస్తా నుంచి బద్దంఎల్లారెడ్డి చౌరస్తా వైపు వెళ్తున్నాడు. అక్కడ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేస్తున్నారు. గమనించిన శ్రీనివాస్ బైక్‌ను వెనక్కి తిప్పాడు. పోలీసులు సైతం శ్రీనివాస్‌ను గమనించి అతడు వెనక్కి వెళ్లకుండా ఆపేందుకు యత్నించారు. ఇంతలో బైక్‌ను వేగంగా నడిపిన శ్రీనివాస్ ఎదురుగా వస్తున్న హుజూరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొని అక్కడికక్కడే మరణించాడు.

స్థానికుల ఆందోళన: ఘటనను గమనించిన స్థానికులు పోలీసులపై మండిపడ్డారు. పెద్దఎత్తున గుమికూడి బద్దం ఎల్లారెడ్డి చౌరస్తా సమీపంలో రోడ్డుపై అరగంటపాటు ఆందోళనకు దిగారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల కారణంగానే శ్రీనివాస్ మృతిచెందాడని ఆరోపించారు. ట్రాఫిక్ జాం కావడంతో పోలీసు అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని ఆందోళన విరమింపజేశారు. శ్రీనివాస్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి పదేళ్ల జైలు

మనోహరాబాద్(తూప్రాన్): కల్తీ కల్లు అమ్మిన వ్యక్తికి మెదక్ కోర్టు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. బుధవారం నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ పద్మ ఈ కేసు వివరాలు వెల్లడించారు. 2016లో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలోని కల్లు దుకాణంలో తనిఖీలు నిర్వహించి కల్లు శాంపిల్‌ను నిజామాబాద్‌కు పంపగా అందులో నిషేధిత ఆల్‌ప్రాజోలం అనే మత్తు పదార్థం ఉన్నట్లు నిర్ధారణ అయింది. దీనిపై ఎక్సైజ్ అధికారులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ఈ ఘటనతో సంబంధమున్న నర్సాగౌడ్ అనే వ్యక్తికి మెదక్ అడిషనల్ జడ్జి లక్ష్మీశారద పదేళ్ల జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల జరిమానా విధించారు. తీర్పు తర్వాత నర్సాగౌడ్‌ను ఎక్సైజ్ పోలీసులు సంగారెడ్డి జైలుకు తరలించారు.

ధనవంతుల కోసమే ధరణి: వీహెచ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ధనిక రైతుల కోసమే ధరణి పోర్టల్ ఉపయోగపడుతోందని మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు విమర్శించారు. ఆయన బుధవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ సభలో సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ గురించి చాలా దృఢమైన వ్యాఖ్యలు చేశారని, ఆయన ప్రజల నుంచి నేరుగా వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుండేదని చెప్పారు. గతంలో పేదలకు పంపిణీ చేసిన భూములపై ధరణి పోర్టల్ ద్వారా అప్పటి యజమానులు హక్కులు పొందుతున్నారని చెప్పారు.

మా రూటే సెప'రేటు'!

▶ మొదటి పేజీ తరువాయి

బ్రోకెన్ రైస్ ఉంటే ఎఫ్‌సీఐ తీసుకోదని.. బ్రోకెన్ తక్కువగా వచ్చే జిల్లాల నుంచి ధాన్యం తెచ్చిపెట్టేలా వెసులుబాటు ఇవ్వాలంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖను కోరాలని వారికి సూచించడమే కాకుండా.. అన్నీ తానై చక్కదిద్దారు. అనుమతి రాగానే యాదాద్రి జిల్లా నుంచి బియ్యాన్ని దిగుమతి చేసుకునేలా మిల్లర్ల సంఘానికి చెందిన ఓ రాష్ట్ర స్థాయి నేతతో కుమ్మక్కయ్యారు.

డబ్బులు చెల్లించిన వారెవరంటే..

అయిజకు చెందిన దేవుడి పేరిట ఉన్న రెండు మిల్లుల యజమానులు సుమారు 35 ఏసీకేలు, గద్వాల ప్రాంతంలో బీరెల్లికి వెళ్లే రహదారి మార్గంలోని రెండు మిల్లుల యజమానులు సుమారు 20 ఏసీకేలు, జమ్ములమ్మ దేవాలయం ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని సుమారు 8 ఏసీకేలు, కేటీదొడ్డి మండల పరిధిలో ఉన్న ఓ మిల్లు యజమాని 15 ఏసీకేలు, ఇటిక్యాల మండలం బీచుపల్లి పరిసర ప్రాంతంలోని ఓ మిల్లు యజమాని 25 ఏసీకేలకు సంబంధించిన డబ్బులను యాదాద్రి జిల్లాలోని రైస్ మిల్లు సంఘం రాష్ట్ర నాయకుడి ఖాతాలో జమ చేసినట్లు సమాచారం. దీనిపై గద్వాల జిల్లా డీసీఎస్ఓ రేవతిని సంప్రదించగా.. డబ్బులు తీసుకుంటున్నట్లు వచ్చిన ఆరోపణలు వాస్తవం కాదన్నారు.

విద్యాశాఖలో పదనిసలు

- లాబీయింగ్ చేసిన వారికే అధికారాలు?
- ఉపాధ్యాయ సంఘం నేతలకు కోఆర్డినేటర్ పోస్టులు..
- అవినీతి ఆరోపణలపై తొలగించిన ఉద్యోగికి మరోసారి జీసీడీఓ పోస్టు
- కొంతకాలంగా పక్కకు పెట్టిన ఫైల్ మళ్లీ తెరపైకి..



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అడ్డదారిలో పైరవీలు చేసి పెద్ద పోస్టులు దక్కించుకునే వారికి అడ్డాగా మారింది. 2020లో డీఈఓ కార్యాలయంలో జీసీడీఓ బాధ్యతలు నిర్వహించిన ఓ అధికారిణిని స్వయంగా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ తొలగించారు. అలాంటి అధికారిణిని మరోసారి నియమించేందుకు విద్యాశాఖలోని ఓ అధికారి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ పోస్టు కోసం ఆమె కొంతకాలంగా పెద్దఎత్తున పైరవీ చేస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు పేరు మోసిన సంఘాలకు అధ్యక్షులుగా వ్యవహరించిన వారిని జిల్లాస్థాయి కోఆర్డినేటర్ పోస్టుల్లో నియమిస్తున్నారు. ఇలా నియమించిన వారు పాఠశాలలు తనిఖీల సమయంలో, పలు విచారణలో ఆయా సంఘాలకు సంబంధించిన వారికి మద్దతుగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో వివాదాస్పద అధికారిగా పేరున్న ఆయన ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం పట్ల పలు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రూ.లక్షలు దండుకొని పోస్టులు..

2020లో విద్యాశాఖకు సంబంధించి బదిలీల్లో ఉద్యోగుల నుంచి పెద్దఎత్తున డబ్బులు తీసుకుని బదిలీలు చేయిస్తామని, సదరు ఉద్యోగిని డబ్బులు వసూలు చేసింది. కేజీబీవీల్లో ఎస్‌ఓల నుంచి ప్రతినెలా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే కేజీబీవీల్లో నాన్‌టీచింగ్‌కు సంబంధించి ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఉద్యోగాల్లో నేరుగా ఏజెన్సీ వారితో కుమ్మక్కై నియమించారని, ఇందుకోసం సదరు ఉద్యోగి రూ.లక్షల్లో దండుకున్నారు. అయితే అక్రమ మార్గంలో చేరిన సదరు 53మందిని ప్రభుత్వం తొలగించింది. అనంతరం సదరు ఉద్యోగిని జీసీడీఓ బాధ్యతల నుంచి తప్పించి.. దేవరకద్రలోని ఓ పాఠశాలకు ఉపాధ్యాయురాలిగా పంపించగా.. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రానికి దగ్గరగా ఉన్న పాఠశాలకు డిప్యూటేషన్‌పై వచ్చారు. అయితే ఆమె పాఠశాలకు సరిగా వెళ్లలేదు. పలుమార్లు, డీఈఓకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఆమె పాఠశాలకు వెళ్లకుండా వ్యవహరించారు. ఇలాంటి అవినీతి ఆరోపణలు ఉన్న ఉద్యోగికి గతంలో ఉన్న అధికారులు బాధ్యతలు ఇచ్చేందుకు మొగ్గు చూపలేదు. కానీ ఇటీవలి ఓ అధికారి అధికారి ఆరోపణలు ఉన్న ఉద్యోగికి బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఉపాధ్యాయ సంఘాల నాయకులు పోస్టులు...

డీఈఓ కార్యాలయంలో వివిధ సెక్షన్ల కింద పని చేసేందుకు మొత్తం నలుగురు కో-ఆర్డినేటర్‌లను నియమిస్తారు. ఇందులో వీరు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణులైన తర్వాత వీరి అనుభవం, సంఘాల నాయకత్వం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని పోస్టులను కేటాయిస్తారు. ప్రధానంగా సంఘాల్లో ఉండకూడదన్న నిబంధన ఉంది. అయితే కొందరు మాత్రం సంఘాల అధ్యక్షులుగా ఉంటూ పరీక్ష రాయడమే కాకుండా, ఫలితాల అనంతరం సంఘం పదవికి రాజీనామా చేసి నేరుగా డీఈఓ కార్యాలయంలో పలు సెక్షన్లలో కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. వీరు జిల్లా స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. సంఘాలకు బాధ్యత వహించిన వారిని నియమించడం వల్ల ఆయా సంఘాలకు సంబంధించిన ఉపాధ్యాయుల పనులను చక్కబెడతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకోసం కోఆర్డినేటర్‌లుగా నియమించేందుకు సంఘాల నుంచి కూడా ఒత్తిడులు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా.. ఆయన స్పందించలేదు.

అవినీతి ఆరోపణలు ఉన్న వారిని నియమించొద్దు..



గతంలో బదిలీల్లో ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం, ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుండి డబ్బులు వసూలు చేయడం, కేజీబీవీల ఎస్ఓల నుండి నెలనెల డబ్బులు వసూలు చేయడం వంటి అంశాలపై అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. దీంతో స్పందించిన కలెక్టర్ వెంటనే సదరు అధికారిణిని విధుల నుంచి తప్పించారు. తాజాగా ఆమెకే జీసీడీఓ పోస్టులో నియమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఇది సరైన పద్ధతి కాదు. ఆ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి. అవినీతి ఆరోపణలు ఉన్న వారికి ఎట్టి పరిస్థితుల్లో నియమించొద్దు.

– వెంకటేష్, టీఎస్‌యూటీఎఫ్, జిల్లా అధ్యక్షుడు

నిరసన చేపడుతాం..



గతంలోనే అవినీతి చేశారని తెలిసిన అధికారికే బాధ్యతలు అప్పగించడం వెనక లోపాయికారి ఒప్పందాలు జరిగాయి. పర్సంటేజీల కోసమే ఆమెను తీసుకుంటున్నట్లు అర్థమవుతుంది. సదరు అధికారిణిని విధుల్లో చేరుతుందంటేనే చాలా మంది ఎస్‌ఓలు, టీచర్‌లు భయపడుతున్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్య, భోజనానికి దూరం అవుతారు. అవినీతి అధికారిణిని జీసీడీఓగా నియమిస్తే వెంటనే జిల్లావ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన చేపడుతాం.

– ప్రశాంత్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ధరణి పోర్టల్‌తో రైతులకు తీవ్ర నష్టం

- టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ధరణి పోర్టల్‌తో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి విమర్శించారు. జిల్ల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి పోర్టల్ గురించి సీఎం కేసీఆర్ గొప్పగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ధరణి పోర్టల్ పూర్తిగా తప్పుల తడకగా మారిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి పోర్టల్‌ను రద్దుచేసి భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. 2004లో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీ భూసంస్కరణ చట్టాన్ని తెచ్చిందని గుర్తుచేశారు. రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి 6 లక్షల ఎకరాల భూములను నిరుపేదలకు పంచినట్లు తెలిపారు. జూలై, ఆగస్టులో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులకు రిజర్వాయర్లకు నీటితో నింపుతామని సీఎం కేసీఆర్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 36 నెలల్లో కర్వెన రిజర్వాయర్‌ను పూర్తిచేస్తామన్న కేసీఆర్ ఇక్కడి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సాగునీటి కాదని కేవలం తాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. రానున్న ఐదు నెలల్లో ఎన్నికలు సమీపిస్తున్నందున సీఎం కేసీఆర్ మరోసారి పాలమూరు ప్రజలను మోసం చేయడానికి యత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ 9 ఏళ్ల కేసీఆర్ పాలనలో ఉమ్మడి జిల్లాలో 9 గుంటలకు కూడా అదనంగా నీళ్లు తీసుకురాలేదన్నారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, లక్ష్మణ్ యాదవ్, తాహెర్ పాల్గొన్నారు.

'పాలమూరు'పై మళ్లీ మోసం

- కొత్త కలెక్టరేట్ నిర్మాణంలోనూ అవినీతి
- మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం

సాక్షి, నాగర్‌కర్నూల్: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి విమర్శించారు. జిల్లాకేంద్రంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. పాలమూరు ప్రాజెక్టు కింద రిజర్వాయర్లను ఆగస్టులో నింపుతామని చెబుతున్నారని, ఓ వైపు తాగునీటి ప్రాజెక్టుగా చెబుతూ రిజర్వాయర్లు ఎలా నింపుతారని ప్రశ్నించారు. ఇప్పటికే మిషన్ భగీరథ కింద ఇంటింటికీ నీరందిస్తున్నామని చెబుతుండగా మళ్లీ తాగునీటి ప్రాజెక్టు అవసరం ఏమొచ్చిందన్నారు. తాను ప్రాజెక్టులను ఆపేందుకు ఎప్పుడు కేసులు వేయలేదని, ప్రాజెక్టుల పేరిట జరుగుతున్న అవినీతిపైనే కోర్టుకు వెళ్లినట్టు స్పష్టం చేశారు. ప్రాజెక్టును ఆపాలని చెన్నైలోని ఎన్‌జీటీని ఆశ్రయించిన కొల్లాపూర్ ఎమ్మెల్యేను సీఎం తన పక్కన కూర్చోబెట్టుకున్నాడని విమర్శించారు. సంగమేశ్వరం, వెలికొండ ప్రాజెక్టులను పూర్తిచేసి కృష్ణా నుంచి ఆంధ్రాకు నీటిని తరలిస్తున్నా ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులకు సోయి లేదని దుయ్యబట్టారు. ధరణి లేకపోతే రైతుబంధు, పంట డబ్బులు బంద్ అవుతాయని ముఖ్యమంత్రి చెబుతున్నారని, 2018 ఎన్నికలకు ముందు రైతుబంధు డబ్బులు వేసినప్పుడు ధరణి ఎక్కడుందని ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా పీఎం కిసాన్ కింద రైతులకు రూ.2వేలు అందుతుండగా, అక్కడ ధరణి అమలులో ఉందా? అని నిలదీశారు. కర్ణాటకలో ప్రవేశపెట్టిన 'భూమి' ఒక్క ఫిర్యాదు లేకుండా 20 ఏళ్లుగా కొనసాగుతూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రాజెక్టు కింద పంపిణీ చేస్తున్న పైపులు ఎమ్మెల్యే కుటుంబానికి చెందినదేనని ఆరోపించారు. నూతన కలెక్టరేట్ నిర్మాణంలో 1.25 లక్షల చదరపు అడుగులకుగానూ రూ. 53 కోట్లు ఖర్చుపెట్టారని చెప్పారు. హైదరాబాద్‌లాంటి నగరాల్లో బహుళ అంతస్తులు నిర్మించిన చదరపు అడుగుకు రూ.1,800 మించదని, అలాంటిది ఇక్కడ చదరపు అడుగుకు రూ.4,200 ఖర్చు అవుతుందా? అని ప్రశ్నించారు. అవినీతి ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనమని చెప్పారు


మాట్లాడుతున్న మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో బంగారు గాజుల ప్రదర్శన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో బుధవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు బంగారు గాజుల ప్రదర్శన నిర్వహిస్తున్నారు. బంగారు గాజుల ప్రదర్శనను ఉపాధ్యాయురాలు నీరజగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ స్టోర్ హెడ్ శరత్ మాట్లాడుతూ 22 క్యారెట్ల పాత బంగారం మార్పిడిపై 0 శాతం తగ్గింపు పొందవచ్చని తెలిపారు. మలబార్ గోల్డ్, డైమండ్స్ నిబద్ధతలో భాగంగా తమ వినియోగదారులకు 10 న్యాయమైన వాగ్దానాలను అందిస్తుందన్నారు. మలబార్ గోల్డ్, డైమండ్స్ అతి వేగంగా పెరుగుతున్న నమ్మకమైన బ్రాండ్ అన్నారు. కార్యక్రమంలో స్టోర్ మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ అలీ, ఉద్యోగులు పాల్గొన్నారు.


మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో బంగారు గాజుల ప్రదర్శన

మొసలి సంచారంతో భయాందోళన

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వలో మొసలి సంచారంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం ఆత్మకూర్ మండల పరిధిలోని మూలమల్ల గ్రామ శివారులోని ప్రధాన ఎడమ కాల్వలో మొసలి పైకి కిందికి సంచరిస్తుంది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సింధూజ, ఎస్సై మహ్మద్ జావెద్, ఫారెస్టు అధికారులు సంఘటన స్థలానికి వెళ్లగా..అప్పటికే అది కనిపించకుండా పోయింది. మొసలి చాలా పెద్దగా ఉందని, త్వరలో దాన్ని ఇక్కడి నుంచి తరలిస్తామని అధికారులు తెలిపారు. 15 రోజులుగా మొసలి సంచరిస్తూ రోడ్డుపైకి వస్తుందని.. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు.

– ఆత్మకూర్


ప్రధాన ఎడమ కాల్వలో సంచరిస్తున్న మొసలి